సాక్షి విశాఖపట్నం

శనివారం । 7 । జనవరి । 2023

‘వెల్‌స్కోప్’పై అవగాహన అవసరం



మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఆంధ్రా మెడికల్ కళాశాల సెమినార్ హాలులో శుక్రవారం వెల్‌స్కోప్ పరికరంపై అవగాహన సదస్సు జరిగింది. దంత వైద్య ముఖ్య శాఖాధిపతి డా.వి.వి.ఎస్.త్రివేణి ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు మాట్లాడారు. నోటి క్యాన్సర్ నిర్ధారణ చేసేందుకు ఉపయోగించే ఈ పరికరంపై అవగాహన అవసరమన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న 80 మంది దంత వైద్యులు ఈ సదస్సుకు హాజరయ్యారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, మెడికల్ అంకాలజీ ముఖ్య వైద్యశాఖాధిపతి రవిమోహన్, రేడియేషన్ అంకాలజీ శాఖాధిపతి డాక్టర్ వై.జి.రావు తదితరులు పాల్గొన్నారు.

సాగర తీరంలో వాల్తేర్ వీరయ్యలు

8లో



న్యూస్‌రీల్

గవర్నర్ పర్యటన వాయిదా

పద్మనాభం(భీమిలి): పాండ్రంగి పంచాయతీ బర్లపేటలో శనివారం రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పర్యటన వాయిదా పడినట్టు రాజీవ్ గాంధీ మానవ సేవ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ తెలిపారు. బర్లపేటలో దివ్యాంగ బాల బాలికల ఉచిత విద్య శిక్షణ, వృద్ధాశ్రమం, యోగా కేంద్రం నూతన భవన నిర్మాణానికి గవర్నర్ శంకుస్థాపన చేయాల్సి ఉందన్నారు.అనివార్య కారణాల వల్ల ఈ కార్యక్రమం వాయిదా పడిందన్నారు.

నేడు ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీలక్ష్మి రాక

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ వై శ్రీలక్ష్మి శనివారం విశాఖ రానున్నారు. విశాఖలో మార్చి నెలలో జీ20 సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆమె పలు ప్రాంతాలు పరిశీలించనున్నారు. ముఖ్యంగా మున్సిపల్ శాఖకు సంబంధించి ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో చర్చించనున్నారు.

8 వరకు డ్వాక్రాబజార్ కొనసాగింపు

రూ.3 కోట్లు దాటిన విక్రయాలు



వినియోగదారులతో సందడిగా స్టాల్

ఏయూక్యాంపస్(విశాఖ తూర్పు): అఖిల భారత డ్వాక్రా బజార్ సరస్–2022 విజయవంతంగా సాగుతోంది. గురువారం నాటికి రూ. 3,25,81,401 విక్రయాలు జరిగినట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభారాణి తెలిపారు. గురువారం ఒక్క రోజులో రికార్డు స్థాయిలో రూ 50,83,130 విలువైన వస్త్రాలు, వస్తువుల విక్రయాలు జరిగాయన్నారు. విశాఖ ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తున్న నేపథ్యంలో డ్వాక్రాబజార్‌ను ఆదివారం వరకు పొడిగిస్తున్నట్లు ఆమె తెలిపారు. దేశవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తున్న సంగతి తెలిసిందే.

వెల్ఫేర్ సెక్రటరీ లొంగుబాటు?

పెన్షన్ సొమ్ము లబ్ధిదారులకు పంపిణీ

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): పెన్షన్ లబ్ధిదారుల సొమ్ముతో ఉడాయించిన 15వ వార్డు సింహాద్రిపురం సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ సత్యనారాయణ పోలీసుల వద్ద లొంగిపోయినట్లు తెలిసింది. వ్యక్తిగత కారణాలతో పెన్షన్ సొమ్ము రూ.7.50లక్షలతో ఆయన ఉడాయించిన సంగతి తెలిసిందే. దీనిపై స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీ విద్య కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. ఈ నేపథ్యంలో వెల్ఫేర్ సెక్రటరీ బంధువుల ఆ మొత్తాన్ని తిరిగి ప్రభుత్వానికి చెల్లించారు. ఇన్‌చార్జి సెక్రటరీ ద్వారా శుక్రవారం లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. కార్పొరేటర్ చొరవతో తమకు పింఛన్ అందడంతో సింహాద్రిపురం లబ్ధిదారులు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. కాగా.. వెల్ఫేర్ సెక్రటరీపై నమోదైన కేసు విచారణ జరుగుతోంది.

8న పెట్ షో

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): విశాఖ కెనైన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8న వివిధ రకాల జాతుల పెంపుడు కుక్కలు, పక్షుల ప్రదర్శన నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు పి ప్రకాష్, కార్యదర్శి ఏఎస్ రావు తెలిపారు. నగరంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివారం ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు అన్ని రకాల పెట్స్, డాగ్ షోను ఎంవీపీ కాలనీ ఆశ్వార్‌దాస్ గ్రౌండ్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్‌రెడ్డి, సహాయ కార్యదర్శి లూయిస్ రిచర్డ్స్, కోశాధికారి ఎస్‌వీ ఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యం!

- విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరం
- మానసిక రోగానికి అది కూడా ఓ ఔషధం
- మీడియా సమావేశంలో ఏఏపీఐ వైద్య నిపుణులు



వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీతో ఫొటో తీసుకుంటున్న వైద్యులు

సాక్షి, విశాఖపట్నం: ప్రజలకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, మానసిక ఆరోగ్యం బాగుంటే అంతా బాగున్నట్టేనని వైద్య నిపుణులు అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. విశాఖలో శుక్రవారం అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా ఒరిజిన్ (ఏఏపీఐ) అధ్యక్షుడు రవి కొల్లితో పాటు వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు మీడియా సమావేశంలో మాట్లాడారు. మానసిక అనారోగ్యంతో ఎందరో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైస్కూల్ విద్యార్థులకు మెంటల్ హెల్త్‌పై అవగాహన పెంచేందుకు కృషి చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. చాలామంది తమకు మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, ఇతర అనారోగ్య సమస్యలున్నట్టు ముందుగా తెలుసుకోలేకపోతున్నారని, ఇది ప్రాణాంతకమవుతుందని చెప్పారు.

సమ్మిట్ సందడి

మహారాణిపేట : విశాఖలో నొవెటల్ హోటల్ వైద్యులు సందడి నెలకొంది. దేశ విదేశాల నుంచి సుమారు 450 వైద్యులు గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. మంత్రులు విడదల రజనీ, గుడివాడ అమర్‌నాథ్, అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

డెల్టాలాంటి వేరియంట్లకు అవకాశం లేదు



కోవిడ్ మహమ్మారి దశలు మార్చుకుని వస్తున్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చైనాలో కోవిడ్ విజృంభిస్తున్నా అక్కడ మరణాల సంఖ్య డెల్టా వేరియంట్‌తో పోల్చుకుంటే చాలా స్వల్పం. మున్ముందు డెల్టాలాంటి వేరియంట్లకు అవకాశం లేదు. చైనాలో కోవిడ్‌పై ఏం చేస్తున్నారో బాహ్య ప్రపంచానికి తెలియడం లేదు. ప్రతివారికీ మాస్క్, శుభ్రత అవసరం. బూస్టర్ డోస్ తీసుకుంటే మంచిది.

– లోకేష్ ఇదర, ఎలర్జీ ఇమ్యునాలజీ స్పెషలిస్ట్, యూఎస్

మమోగ్రామ్ ముఖ్యం



9–11 ఏళ్ల మధ్య వయసున్న బాల బాలికలకు కూడా ప్రీ–క్యాన్సర్ పరీక్షలు అవసరం. నలభై ఏళ్లు దాటిన మహిళల్లో రొమ్ము క్యాన్సర్ సైలెంట్‌గా ప్రవేశిస్తుంది. దీనిని ముందస్తుగా గుర్తించడానికి మమోగ్రామ్ పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలి. హెచ్‌పీవీ వ్యాక్సిన్ సర్వైకల్ క్యాన్సర్‌ను నిరోధిస్తుంది.

– మెహర్ బాల, ప్రైమరీ హెల్త్ కేర్, యూఎస్

ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ చాలా మంచిది



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చేపడుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ చాలా మంచిది. ఇది స్పెషాలిటీగా వస్తోంది. అందుబాటులో ఉండే వైద్యులు ప్రజల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించి సకాలంలో తగిన వైద్యం అందిస్తారు. దీనిపై బాగా చర్చించాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు.

– విశ్వేశ్వర రంగా, ఇంటర్నల్ మెడిసిన్, లాస్‌వెగాస్

విద్యార్థుల్లో ఒత్తిడి అధికం

ప్రస్తుతం విద్యార్థుల్లో ఒత్తిడి అధికంగా ఉంది. దీంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అందువల్ల మానసిక ఆరోగ్యంపై అవగాహన పెరిగితే ఆత్మహత్యలు తగ్గుతాయి. మానసిక ఆరోగ్యం బాగుంటే మనుషులకే కాదు.. సొసైటీకే మేలు జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వ హైస్కూలు పిల్లలకు మెంటల్ హెల్త్‌పై ఫోకస్ పెట్టడం అభినందనీయం.

– సతీష్ జొన్నలగడ్డ, మానసిక వైద్య నిపుణుడు, యూఎస్



మీడియాతో మాట్లాడుతున్న రవి కొల్లి

అక్రమాలకు చరమ‘గీతం’



అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

- ఆక్రమణలు జరగకుండా రక్షణ కంచె ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు
- రెండేళ్ల క్రితం ఇవే భూముల్లో గీతం ఆక్రమణల తొలగింపు
- మొత్తం 19.39 ఎకరాలకు కంచె ఏర్పాటు చేసిన సిబ్బంది
- ప్రభుత్వ భూమి పరిరక్షణలో భాగంగా చర్యలు
- సుమారు రూ.190 కోట్ల భూమికి కంచె
- మెడికల్ కాలేజీ కూల్చేస్తున్నారంటూ వదంతులు సృష్టించిన టీడీపీ నేతలకు చుక్కెదురు

సాక్షి, విశాఖపట్నం : గీతం అక్రమాల కంచె క్రమక్రమంగా తొలగిపోతోంది. అప్పట్లో తెలుగుదేశం సర్కారు అండతో ప్రభుత్వ భూముల్లోనూ ‘గీత’ దాటి అక్రమ నిర్మాణాలు చేపట్టగా.. వాటన్నింటి కబ్జా కంచెని తొలగించి.. రక్షణ వలయం ఏర్పాటు చేస్తున్నారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా.. భీమిలి రెవెన్యూ బృందం గీతంపై చర్యలకు ఉపక్రమించింది. గతంలో స్వాధీనం చేసుకున్న సుమారు రూ.190 కోట్ల భూముల్ని పరిరక్షిస్తూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తోంది. మరోవైపు గీతం మెడికల్ కాలేజీని కూల్చేస్తున్నారంటూ వదంతులు సృష్టించి.. గందరగోళ వాతావరణాన్ని కలిగించేందుకు ప్రయత్నించిన నగర టీడీపీ నేతలకు చుక్కెదురైంది.

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖలో భూ కుంభకోణాలపై చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటి వరకూ ఒకటి కాదు రెండు కాదు.. వేల కోట్ల రూపాయల ప్రభుత్వ భూములను కబ్జాదారుల కబంధ హస్తాల నుంచి అధికారులు విడిపించారు. ఇందులో భాగంగా గీతం ఆక్రమణ చెరలో ఉన్న భూములను కూడా విడిపించారు. 2020 అక్టోబర్ 24న ప్రభుత్వ భూముల్లో గీతం నిర్మించిన ప్రహరీ, ఇతర నిర్మాణాలను తొలగించిన రెవెన్యూ అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. అయితే స్వాధీనం చేసుకున్న భూములు తిరిగి ఆక్రమణలకు గురి కాకుండా ఫెన్సింగ్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు తెల్లవారు జాము నుంచి భీమిలి, విశాఖపట్నం ఆర్డీవోలు భాస్కర్‌రెడ్డి, హుస్సేన్ సాహెబ్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ప్రారంభించారు. అధికారులు కంచె బిగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సర్వే నంబర్ 10,17,30లో మొత్తం 19.39 ఎకరాల ప్రభుత్వ భూమికి రక్షణ వలయం ఏర్పాటు చేశారు. మొత్తం భూమి విలువ బహిరంగ మార్కెట్లో అక్షరాలా రూ.190 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

భంగపడ్డ టీడీపీ

త్వరితగతిన రక్షణ వలయం ఏర్పాటు చేసి ఉదయం 10 గంటల తర్వాత సాధారణ విధులకు హాజరవ్వాలనే ఉద్దేశంతో ఉదయం నుంచే అధికారులు ప్రక్రియ ప్రారంభించారు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు ఇదే అదనుగా హడావుడి చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. గీతం వద్ద ఆందోళనలు చేపట్టేందుకు సమాయత్తమయ్యారు. తమ వాట్సప్ గ్రూపులలోనూ గీతం మెడికల్ కళాశాలను కూల్చేస్తున్నారని, 200 మంది పోలీసులు, ప్రభుత్వ సిబ్బందితో కూల్చేస్తున్నారని, అక్కడ ఆందోళనలు చేసేందుకు రావాలంటూ మెసేజీలు చక్కర్లు కొట్టాయి. ముందస్తుగా భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త రాజబాబు వెళ్లి హడావుడి చేసేందుకు ప్రయత్నించారు. ఆర్డీవో భాస్కర్‌రెడ్డి జరిగిన విషయం చెప్పగానే అక్కడి నుంచి దిగాలుగా వెళ్లిపోయిన టీడీపీ శ్రేణులు, అందరికీ విషయాన్ని చెప్పడంతో.. ఆందోళనకర వాతావరణం సృష్టించాలని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయంటూ భంగపడ్డారు. దీంతో రెవెన్యూ అధికారులు ప్రశాంతంగా ప్రభుత్వ భూమిని పరిరక్షించే పనిని పూర్తి చేశారు.

నేడు వైవీ సుబ్బారెడ్డి రాక



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి శనివారం విశాఖకు రానున్నారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో గాజువాక, భీమిలి నియోజకవర్గాల వారీగా పార్టీ నాయకుల, కార్యకర్తలతో సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. ఆదివారం అనకాపల్లి జిల్లాలో గల పలు నియోజకవర్గాల్లో పార్టీశ్రేణులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

ఓటమి భయంతోనే ప్రభుత్వంపై బాబు విమర్శలు

చంద్రబాబుపై మండిపడ్డ విజయసాయిరెడ్డి



సాక్షి, విశాఖపట్నం: ఓటమి భయంతోనే చంద్రబాబు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నాడని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సొంత నియోజకవర్గంలోనూ ఓడిపోతాననే భయం చంద్రబాబు మొహంలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఏపీలో ‘అప్రకటిత ఎమర్జెన్సీ’ అమలులో ఉందంటూ చంద్రబాబు చేసిన విమర్శలలో ఎంతమాత్రం వాస్తవం లేదని కొట్టిపారేశారు. ఆ ఆరోపణలతో జనం సానుభూతి కోసం బాబు వెంపర్లాడుతున్నాడని మండిపడ్డారు..‘ఫెయిల్డ్ సీఎం’ అని నిర్ధారించిన ఈ మాజీ ముఖ్యమంత్రి– ఏపీ పరిపాలనకు సంబంధించి ఏఏ రంగాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విఫలమైందో చెప్పడం లేదన్నారు. ఆయన చెప్పుకుంటున్నట్టు 45 ఏళ్ల రాజకీయ అనుభవం ఉండి కూడా పదవిలో ఉన్న ముఖ్యమంత్రిని చంద్రబాబు అనరాని మాటలు అంటూ టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారన్నారు. కుప్పంలో కూర్చుని తన విష ప్రచారంతో ఆంధ్రప్రదేశ్ లోని మిగిలిన 174 నియోజవర్గాల ప్రజలను మాయచేసి, బురిడీ కొట్టించాలని ఆయన పన్నాగాలు పన్నుతున్నట్టు కనిపిస్తోందన్నారు. విశేష అనుభవంతో సమయస్ఫూర్తి గల రాజకీయవేత్తగా నడుచుకోవాల్సిన చంద్రబాబు ఇలా రెచ్చిపోయి మాట్లాడడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఆయనకు ఓటమి భయం వెంటాడుతోందా? లేక ఏ మాత్రం వాస్తవానికి దగ్గరగా లేని అభియోగాలతో 2024 ఏపీ శాసనసభ ఎన్నికల్లో గెలవగలనని ఆయన కలలు కంటున్నారా? అనే అనుమానాలు ఇప్పుడు సామాన్య ప్రజానీకానికి కూడా వస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఏపీలో ఉన్నది ‘పాత కాంగ్రెస్’ ప్రభుత్వం కాదని గుర్తిస్తే చంద్రబాబుకు మంచిదన్నారు. 1975–77 నాటి ఎమర్జెన్సీ రోజులే బాగున్నాయని సర్టిఫికెట్ ఇస్తున్న చంద్రబాబు మాటలు కుప్పం ప్రజలకే వెగటు పుట్టిస్తున్నాయని మండిపడ్డారు. ఇకనైనా టీడీపీ అధినేత తన కాళ్ల చేతులూ కూడదీసుకుని ప్రజాతంత్ర పంథాలో అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమైతే అందరికీ మంచిదని విజయసాయిరెడ్డి హితవు పలికారు.

స్థాయీ సంఘంలో 13 అంశాలకు ఆమోదం



స్థాయీ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ స్థాయీ సంఘం సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరివెంకట కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 13 అంశాలతో పాటు ఒక టేబుల్ అజెండా పొందుపరచగా, అన్ని అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. బుచ్చిరాజుపాలెంలో రాత్రి నిరాశ్రయుల కేర్ టేకర్, మేనేజర్ పారితోషికంతో పాటు నిర్వహణ ఖర్చులు ఏడాదికి రూ.6.24 లక్షలు, రెవెన్యూ విభాగంలో దుకాణాలు, వాణిజ్య సముదాయాల అద్దెలు, అద్దె చెల్లించని దుకాణాలకు తాళాలు వేయడం వంటి అంశాలను ఆమోదించారు. అలాగే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ అసిస్టెంట్లు కొండ్ర హరి గోపాలకృష్ణ(రెవెన్యూ ఇన్‌స్పెక్టర్–19 నుంచి 26 వార్డులకు), బోడసింగి సుధాకర్ (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్–66, 67, 68 వార్డులు), భీమిలి జోన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రట్టపు రవికుమార్‌ను ప్రాసిక్యూషన్ చేసేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.314.47 లక్షలకు ఆమోదం తెలిపారు. టేబుల్ అజెండాగా హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో ఆరిలోవలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ లీజుకు ఆమోదం తెలిపారు. స్థాయీ సంఘ సమావేశంలో సభ్యులతో పాటు పట్టణ ప్రణాళికాధికారి సురేష్, ఉప పట్టణ ప్రణాళిక అధికారులు నరేంద్ర, పద్మజ, రత్నకుమార్, ఏసీపీలు, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్‌పై జూమ్

- ఇంటర్మీడియెట్ విద్యపై ఫోకస్
- కాలేజీల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 10 వరకు గడువు
- నిబంధనలు పాటిస్తేనే గుర్తింపు
- డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సిందే
- అన్నీ బాగుంటేనే అఫ్లియేషన్ ఫీజుకు పిలుపు
- లేకుంటే దరఖాస్తు తిరస్కరణ
- 2023-24 విద్యా సంవత్సరానికి సన్నద్ధత

విశాఖ విద్య:

2022–23 విద్యా సంవత్సరంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఐదు ప్రైవేటు జూనియర్ కాలేజీల నిర్వహణను బోర్డు అధికారులు హోల్డ్‌లో పెట్టారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించలేదని ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు గుర్తించారు. ఈలోగా ఆ కాలేజీల్లో అడ్మిషన్లు పూర్తి చేసి, తరగతులు ప్రారంభించేశారు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇలాంటి సమస్యలు భవిష్యత్‌లో ఉత్పన్నం కాకుండా ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేసింది. ఈసారి ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో ముందుగానే త్రీమెన్ కమిటీలు తనిఖీలు చేపట్టనుంది. ఇంటర్ కోర్సులకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా కాలేజీల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నిబంధనలు పాటించని కాలేజీలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వడానికి వీల్లేదని ప్రభుత్వం స్పష్టం చేయడంతో ఇందుకనుగుణంగా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. 2023–24 విద్యా సంవత్సరం సంబంధించి కాలేజీల నిర్వహణకు ప్రభుత్వ గుర్తింపు ఇచ్చే విషయంలో ఈసారి ముందుగానే విధి విధానాలు ప్రకటించారు. ప్రైవేటు కాలేజీల నిర్వాహకులు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 10 వరకు గడువు ఇచ్చారు.



ఆర్ఐవో కార్యాలయం

ఉమ్మడి జిల్లాలో ఇలా..

విశాఖ కేంద్రంగా ఉన్న ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి నేతృత్వంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని జూనియర్ కాలేజీల నిర్వహణకు అనుమతులు ఇవ్వనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలు కలుపుకొని విశాఖ జిల్లాలో 185, అనకాపల్లిలో 136, అల్లూరిలో 39 కాలేజీలు ఉన్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 360 కాలేజీలకు గాను 246 ప్రైవేటు కాలేజీలు కాగా, ఇందులో ఒక్క విశాఖపట్నంలోనే 159 వరకు కొనసాగుతున్నాయి. 2022–23 విద్యా సంవత్సరంలో మూడు జిల్లాల్లో కలిపి మొదటి సంవత్సరం 57,936, రెండో సంవత్సరం 53,611 మంది విద్యార్థులు చదువుతున్నారు.

కార్పొరేట్‌కు అడ్డుకట్ట..

ఉత్తరాంధ్ర జిల్లాలకు ముఖ్య కూడలిగా ఉన్న విశాఖ నగరంలో, కొన్ని కార్పొరేట్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాలేజీల్లో సరైన వసతులు, అర్హతగల అధ్యాపకులు లేకుండానే కొనసాగిస్తున్నారనే ఫిర్యాదులు ప్రభుత్వానికి అందుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు మేరకు అన్నీ సక్రమంగా ఉంటేనే, కాలేజీ గుర్తింపు కోసమని అఫ్లియేషన్ ఫీజు తీసుకుంటారు. నిబంధనలు పాటించని కాలేజీలను దరఖాస్తుల పరిశీలన సమయంలోనే తిరస్కరిస్తారు. పారదర్శకతకు పెద్దపీట వేసేలా చేపడుతున్న ఇలాంటి చర్యలతో కార్పొరేట్ సంస్థ ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

ఆన్‌లైన్‌తో పారదర్శకత..

కాలేజీల నిర్వహణకు అనుమతులు పొందేందుకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను కాలేజీ యాజమాన్యాల వారు ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. ఆర్ఐవో మొదలుకొని ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులతో పాటు, విద్యాశాఖ ఉన్నతాధికారులు సైతం నేరుగా వీటిని పరిశీలించే అవకాశం ఉంటుంది. కాలేజీ నిర్వహణకు భవనాలు, అధ్యాపకులు, సైన్సు ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, ఆట స్థలం, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు ఇలా అన్ని రకాల మౌలిక సౌకర్యాలకు సంబంధించిన వివరాలను, వాటి ఫొటోలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.

నిబంధనలు పాటించాల్సిందే



ప్రైవేటు కాలేజీల నిర్వాహకులు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. విద్యార్థులకు సరైన వసతులు కల్పించని కాలేజీల విషయంలో ఈ సారి కఠినంగానే వ్యవహరిస్తాం. ప్రభుత్వం ప్రకటించిన సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించడానికి వీల్లేదు. ఇలాంటి వాటిపై ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. కాలేజీల నిర్వహణకు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 10 వరకు దరఖాస్తు చేసుకోవాలి.

– ఆర్.సత్యనారాయణ, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

పేదలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యం

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని


మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

మహారాణిపేట(విశాఖ దక్షిణ): పేద రోగులకు కార్పొరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని అన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీలో రూ.73.92 కోట్ల నిధులతో తలపెట్టిన పీజీ విద్యార్థుల హాస్టల్ భవనాలకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య రంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను నాడు–నేడు పథకం కింద కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. అవసరమైన అధునాతన వైద్య పరికరాలను సమకూర్చడంతో పాటు అనేక కీలకమైన వైద్యుల పోస్టులను కూడా భర్తీ చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చొరవతో కేజీహెచ్‌లో రూ.600 కోట్ల నిధులతో నాడు–నేడు కింద పలు పనులు చేపట్టామన్నారు. కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ ఈ హాస్టల్ భవనాల నిర్మాణంతో విద్యార్థులకు మెరుగైన వసతి సదుపాయాలు లభిస్తాయన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ వైద్య కళాశాలలో పీజీ సీట్ల పెంచడంపై సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబర్–అక్టోబర్ మధ్యలో ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ తాను కేజీహెచ్‌లో జన్మించానని, ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైద్య విద్య అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రాఘవేంద్రరావు, ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ జాన్‌వెస్లీ, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎస్‌ఈ శివకుమార్, కార్పొరేటర్లు ఉరుకూటి నారాయణరావు, బిపిన్ కుమార్‌జైన్, కోడూరు అప్పలరత్నం, మాసిపోగు మేరీ జోన్స్, వైఎస్సార్ సీపీ నాయకులు పీతల వాసు, మన్యాల శ్రీనివాస్, దశమంతుల చిన్ని పాల్గొన్నారు.

అధికార దాహంతో చంద్రబాబు చిందులు

పెదగంట్యాడ (గాజువాక) : టీడీపీ అధినేత చంద్రబాబు అధికార దాహంతో చిందులు వేస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజని ఎద్దేవా చేశారు. చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని దుయ్యబట్టారు. గంగవరంలో రూ.కోటి ఐదు లక్షలతో కొత్తగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు మాటలు చెప్పి మోసం చేశాడని, అధికారం కోల్పోయిన తర్వాత కూడా తన పంథాను మార్చుకోకుండా ప్రజలను మళ్లీ మళ్లీ మోసం చేస్తూనే ఉన్నాడని ధ్వజమెత్తారు.

కుమారుడి పెళ్లికి సీఎంను ఆహ్వానించిన ఎంపీ


విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎంవీవీ సత్యనారాయణ సతీసమేతంగా శుక్రవారం తాడేపల్లి వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దంపతులను వారి నివాసంలో కలిశారు. తన కుమారుడు శరత్ చౌదరి వివాహ ఆహ్వాన పత్రికను సీఎం జగన్‌కు అందజేశారు. వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించాలని కోరారు. - విశాఖ విద్య

పీవీకి కేంద్ర సహాయమంత్రి నివాళులు


పి.వి.చలపతిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర సహాయ మంత్రి మురళీధరన్

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): బీజేపీ సీనియర్ నాయకుడు పి.వి.చలపతిరావు మృతి పార్టీకి తీరని లోటని కేంద్ర విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి మురళీధరన్ అన్నారు. నగరానికి వచ్చిన ఆయన శుక్రవారం ఎమ్మెల్సీ మాధవ్ ఇంటికి వెళ్లి.. అక్కడ పి.వి.చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పి.వి.కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాజ్‌పేయి, అద్వానీ వంటి సీనియర్ నాయకుల సమకాలికుడు, పార్టీ అభ్యున్నతికి ఆదర్శనీయ పోరాటాలు చేసిన గొప్ప నాయకుడు పి.వి.చలపతిరావు అని కొనియాడారు. తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని మాధవ్‌కు సూచించారు.

పాత్రికేయులు పోరాటయోధులు


బ్యాటింగ్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

విశాఖ స్పోర్ట్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడే పాత్రికేయులు.. పోరాటయోధులని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. అంతర్ మీడియా స్పోర్ట్స్‌లో భాగంగా పోర్ట్ స్టేడియంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో ఆమె పాల్గొని..మాట్లాడారు. క్రీడల వల్ల శారీరక అలసట తొలిగి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కాసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. వీజేఎఫ్, విస్జా ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా.. శుక్రవారం జరిగిన పోటీల్లో ఎలక్ట్రానిక్ మీడియా జట్టు ఆరు వికెట్ల తేడాతో విస్జా జట్టుపై విజయం సాధించింది. విస్జా ఏడు వికెట్లకు 87 పరుగులు చేయగా ఎలక్ట్రానిక్ మీడియా జట్టు నాలుగే వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. మరో పోటీలో వీడియో జర్నలిస్టుల జట్టు తొమ్మిది వికెట్లకు 59 పరుగులు చేయగా.. ఆంధ్రప్రభ జట్టు ఒకే వికెట్ కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది.

ఉత్తరాంధ్రకు తీరని లోటు

- తులసీరావుకు విజయసాయిరెడ్డి నివాళి


తులసీరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి

యలమంచిలి: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతి పాడి రైతులు, ఉత్తరాంధ్ర ప్రజలకు తీరని లోటని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి యలమంచిలి పట్టణంలో తులసీరావు నివాసానికి వచ్చి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. తులసీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తులసీరావు సతీమణి జయమ్మ, కుమారుడు ఆడారి ఆనంద్‌కుమార్, కుమార్తె పిళ్లా రమాకుమారిలకు ధైర్యం చెప్పారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొన్నారు.

‘ఆర్‌ఐగానే సందీప్‌కు పోస్టింగ్ ఇవ్వాలి’

ఆరిలోవ: రూరల్ మండలం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కు పోస్టింగ్ ఇవ్వాలని హైకోర్టు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. తనను లైంగికంగా వేధించినట్లు ఆర్‌ఐ సందీప్‌పై ఓ మహిళా వీఆర్వో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ గత ఏడాది ఫిబ్రవరిలో సందీప్‌పై వేటు వేశారు. ఈ ఘటనపై కలెక్టర్ వేసిన డీఎల్‌సీసీ కమిటీ దర్యాప్తు చేపట్టి వివరాలు సేకరించింది. ఆ వివరాల ప్రకారం తనపై వచ్చిన ఫిర్యాదులో నిజం లేదని వెల్లడైందని ఆర్‌ఐ సందీప్ తెలిపారు. దీంతో కలెక్టర్ జనరల్ బదిలీల్లో తనను వేరే చోటకు వేరే పోస్టింగ్ ఇస్తూ బదిలీ చేశారన్నారు. ఆర్‌ఐ పోస్టు కాకుండా వేరే పోస్టు ఇవ్వడంపై హైకోర్టును ఆశ్రయించినట్లు సందీప్ తెలిపారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు తనకు ఆర్‌ఐ పోస్టు ఇవ్వాలని గత నెల 7న తీర్పు వెల్లడించిందన్నారు. మూడు వారాల్లోగా తనకు ఆర్‌ఐ పోస్టింగ్‌తో పాటు అన్ని బెనిఫిట్స్ ఇవ్వాలని కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ ఉత్తర్వులు డిసెంబర్ 29న కలెక్టర్‌కు అందాయన్నారు.

దివీస్ ఉద్యోగి ఆత్మహత్య

తగరపువలస: షేర్ మార్కెట్‌లో పెట్టుబడుల్లో నష్టాల కారణంగా భీమిలి జోన్ రెండోవార్డు ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్న దివీస్ ఉద్యోగి కొండలు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మేరీ ప్రియ చర్చికి వెళ్లి తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపులు లోపలి నుంచి వేసి ఉన్నాయి. స్థానికుల సాయంతో తలుపులు తెరచి చూడగా చున్నీతో సీలింగ్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే కొండలును సంగివలస ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించగా అ ప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దివీస్ లేబొరేటరీలో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొండలు తన కు నెలనెలా వచ్చే జీతాన్ని షేర్‌మార్కెట్‌లో పెడుతుంటాడు. భార్య ఫిర్యాదుతో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కూర్మన్నపాలెం(గాజువాక): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. వడ్లపూడి ప్రాంతానికి చెందిన తమటాపు మొల్లినాయుడు(51) గురువారం అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. తెల్లవారేసరికి కాపుజగ్గరాజుపేట ఎస్టీపీసీ రైల్వే ట్రాక్‌పై మృతి చెంది కనిపించాడు. అతని పర్సులో ఉన్న డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా కుటుంబ సభ్యులకు దువ్వాడ పోలీసులు సమాచారం అందించారు. మొల్లినాయుడుకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భార్య జగదీశ్వరి ఫిర్యాదు మేరకు ఆత్మహత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగరతీరంలో వాల్తేర్ వీరయ్యలు

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): సాగరతీరంలో వాల్తేరు వీరయ్య వేషధారణలో చిరంజీవి అభిమానులు సందడి చేశారు. ఈ నెల 13న విడుదల కానున్న మెగాస్టార్ చిరంజీవి నటించిన వాల్తేర్ వీరయ్య చిత్రం ప్రమోషన్‌లో భాగంగా శుక్రవారం వందలాది మంది అభిమానులు సాగరతీరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా చిరంజీవి అభిమానుల సంఘం అధ్యక్షుడు స్వామినాయుడు మాట్లాడుతూ ఈ నెల 8న ఏయూలో జరిగే ప్రీరిలీజ్ ఈవెంట్‌కు అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ప్రీ రిలీజ్ వేదిక మార్పు

ఆర్.కె.బీచ్‌లో మెగా మాస్ పార్టీ పేరుతో వాల్తేరు వీరయ్య చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించాలని ముందుగా నిర్వాహకులు భావించారు. అయితే మెగాస్టార్, మాస్ మహారాజ్ రవితేజ అభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో వేదిక మార్చుకోవాలని పోలీసులు సూచించారు. ఈ నేపథ్యంలో ఏయూ మైదానంలో ప్రీ రిలీజ్ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు మెగా నావిగేషన్ చిత్రం

దేశంలోనే తొలిసారిగా నావిగేషన్‌తో చిరంజీవి చిత్రం రూపొందించేందుకు అభిమానులు ఏర్పాటు చేశారు. నగరంలోని పలు ప్రాంతాలను కలుపుతూ మెగాస్టార్ చిత్రాన్ని రూపొందించనున్నారు. ఇందుకు వందలాది మంది అభిమానులు తమ బైకుల మీద వివిధ ప్రాంతాల్లో ఉండి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నారు.